TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్

# వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక


సంపుటి : 01| సంచిక : 41 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ గురువారం | మే 21, 2026



## వైభవంగా ప్రారంభమైన
## 'సరస్వతీ అంత్య పుష్కరాలు'

- కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి రాక
- పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు
- కాళేశ్వరంలో త్రివేణి సంగమ తీరాన భక్తుల కిట కిట
- ప్రభుత్వ ఆధ్వర్యంలో అంత్య పుష్కరాల నిర్వహణ
- జూన్ 1 వరకు వేడుకలు..
- ఘాట్ల వద్ద భక్తుల కోసం భారీ ఏర్పాట్లు

కాళేశ్వరం, వాయిస్ ఆఫ్ వందే భారత్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కాళేశ్వర త్రివేణి సంగమ తీరాన 'సరస్వతీ నది అంత్య పుష్కరాలు' గురువారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి మహాస్వామి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలతో కలిసి అంత్య పుష్కరాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంచి పీఠాధిపతితో పాటు మంత్రులిద్దరూ పవిత్ర గోదావరి–ప్రాణహిత–సరస్వతీ నదుల సంగమ క్షేత్రంలో తొలి పుణ్యస్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధారణంగా నది పుష్కరాల ప్రారంభంలో 'ఆది పుష్కరాలు' నిర్వహించడం ఆనవాయితీ కాగా, నది పుష్కర కాలం ముగిసే చివరి 12 రోజుల్లో నిర్వహించే 'అంత్య పుష్కరాల'కు తెలంగాణ ప్రభుత్వం ఈసారి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా ప్రభుత్వ అధికారిక ఆధ్వర్యంలో ఈ అంత్య పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ప్రస్తుతం భానుడి భగభగలు, వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ఎండ దెబ్బ తగలకుండా ఘాట్ల పరిసరాల్లో భారీ జర్మన్ టెంట్లు, చల్లదనం కోసం వందలాది కూలర్లను ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తో పాటు ప్రధాన వీఐపి ఘాట్ల వద్ద మహిళలు, భక్తులు దుస్తులు మార్చుకోవడానికి 300కు పైగా తాత్కాలిక గదులను నిర్మించారు. నదిలో నీటి ప్రవాహం ఉన్నందున భక్తులు లోతులోకి వెళ్లకుండా రక్షణ తాళ్లతో, బారికేడ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. నది వద్ద నిరంతరం పర్యవేక్షించేందుకు లైఫ్ గార్డులను, ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.



2లో..

## తిరుమలలో పెరిగిన రద్దీ

- వేసవి సెలవులతో భక్తుల రాక
- దర్శనానికి 24గంటలకు పైగా సమయం
- సంయమనం పాటించాలని టీటీడీ విజ్ఞప్తి
- 24 గంటలూ కమాండ్ కంట్రోల్ నిఘా..
- క్యూలైన్లలోనే తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ



2లో..

## రూపాయి పతనంపై ఆర్‌బీఐ దిద్దుబాటు

- అధికారులతో గవర్నర్ మల్హోత్రా మంతనాలు
- బుధవారం 96.95 రికార్డు పతనం..
- గురువారం నాటి ట్రేడింగ్‌లో 41 పైసలు పుంజుకున్న రూపాయి



4లో..

## ఉప్పల్‌లో 'సన్‌రైజర్స్' ఐపీఎల్ మ్యాచ్

- బ్లాక్ మార్కెట్‌లో టికెట్ల దందాపై పోలీసుల ఉక్కుపాదం
- నేడు ఎస్ఆర్‌హెచ్ వర్సెస్ ఆర్‌సీబీ హైవోల్టేజ్ పోరు..



4లో..

## కనీస వేతనాలు భారీగా పెంపు

- జూన్ 1, 2026 నుంచి అమలు..
- కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
- లబ్ధిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు
- కేటీఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు
- సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం

2లో..



# వైభవంగా ప్రారంభమైన 'సరస్వతీ అంత్య పుష్కరాలు'

- కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి రాక
- పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు
- కాళేశ్వరంలో త్రివేణి సంగమ తీరాన భక్తుల కిట కిట
- ప్రభుత్వ ఆధ్వర్యంలో అంత్య పుష్కరాల నిర్వహణ
- జూన్ 1 వరకు వేడుకలు..
- ఘాట్ల వద్ద భక్తుల కోసం భారీ ఏర్పాట్లు



**కాళేశ్వరం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కాళేశ్వర త్రివేణి సంగమ తీరాన 'సరస్వతీ నది అంత్య పుష్కరాలు' గురువారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి మహాస్వామి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలతో కలిసి అంత్య పుష్కరాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంచి పీఠాధిపతితో పాటు మంత్రులిద్దరూ పవిత్ర గోదావరి–ప్రాణహిత–సరస్వతీ నదుల సంగమ క్షేత్రంలో తొలి పుణ్యస్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



### రాష్ట్రంలోనే తొలిసారి ..

సాధారణంగా నది పుష్కరాల ప్రారంభంలో 'ఆది పుష్కరాలు' నిర్వహించడం ఆనవాయితీ కాగా, నది పుష్కర కాలం ముగిసే చివరి 12 రోజుల్లో నిర్వహించే 'అంత్య పుష్కరాల'కు తెలంగాణ ప్రభుత్వం ఈసారి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా ప్రభుత్వ అధికారిక ఆధ్వర్యంలో ఈ అంత్య పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ప్రస్తుతం భానుడి భగభగలు, వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ఎండ దెబ్బ తగలకుండా ఘాట్ల పరిసరాల్లో భారీ జర్మన్ టెంట్లు, చల్లదనం కోసం వందలాది కూలర్లను ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తో పాటు ప్రధాన వీఐపి ఘాట్ల వద్ద మహిళలు, భక్తులు దుస్తులు మార్చుకోవడానికి 300కు పైగా తాత్కాలిక గదులను నిర్మించారు. నదిలో నీటి ప్రవాహం ఉన్నందున భక్తులు లోతులోకి వెళ్లకుండా రక్షణ తాళ్లతో (సేఫ్టీ రోప్స్), బారికేడ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. నది వద్ద నిరంతరం పర్యవేక్షించేందుకు లైఫ్ గార్డులను, ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.



### దేశంలోనే రెండో క్షేత్రం..

ప్రాణహిత, గోదావరి నదులలో అంతర్వాహిణిగా (గుప్తంగా) సరస్వతి నది ప్రవహించే పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వరం. భారతదేశంలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) తర్వాత, కేవలం కాళేశ్వరంలోనే సరస్వతి నది అంతర్వాహిణిగా ప్రసిద్ధి చెందింది. ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా తరహాలోనే, కాళేశ్వరంలోనూ ఈ అంత్య పుష్కరాలకు పండితులు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. ఆది పుష్కరాల్లో నదీ స్నానం ఆచరించి, పిత్రు తర్పణాలు ఇస్తే ఎలాంటి పుణ్యఫలం దక్కుతుందో.. అంత్య పుష్కరాల సమయంలోనూ అదే విధమైన అనంత ఫలితాలు లభిస్తాయని వేద పండితులు స్పష్టం చేస్తున్నారు. జూన్ 1వ తేదీ వరకు కొనసాగే ఈ పుష్కరాల్లో ప్రతిరోజు సాయంత్రం వేళ నదీ మాతకు అత్యంత నయనానందకరంగా 'మంగళ హారతి' ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.



### ఐదు రాష్ట్రాల నుంచి భక్తుల రాక..

ఈ అంత్య పుష్కరాలకు తెలుగు రాష్ట్రాల (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుండి కూడా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దానికి అనుగుణంగానే జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సర్వసన్నద్ధమయ్యాయి.



# కనీస వేతనాలు భారీగా పెంపు

- జూన్ 1, 2026 నుంచి అమలు..
- కేబినేట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
- లబ్దిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు
- కేటీఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు
- సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలోని కోటి మందికి పైగా ఉన్న కార్మిక లోకానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భారీ సుభవార్త అందించారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న కార్మికుల కనీస వేతనాలను భారీగా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన సుదీర్ఘ మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆమోద ముద్ర వివరాలను వెల్లడించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో 1.11 కోట్ల మంది కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, తమ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వారి వేతనాలను సవరించిందని సీఎం స్పష్టం చేశారు. కార్మికులను వారి పనితీరు ఆధారంగా 4 కేటగిరీలుగా, ప్రాంతాల ఆధారంగా 3 వర్క్ జోన్లుగా (జోన్–1: కార్పొరేషన్లు, జోన్–2: మున్సిపాలిటీలు, జోన్–3: గ్రామీణ ప్రాంతాలు) విభజించి వేతనాలు ఖరారు చేశారు. పెరిగిన వేతనాలు జూన్ 1, 2026 నుండి అమల్లోకి వస్తాయని సీఎం ప్రకటించారు. అన్‌స్కిల్డ్ రూ.12,750 నుంచి రూ. 16,000కు పెంపు, సెమీ స్కిల్డ్ రూ.13,152 నుంచి రూ.17,000 పెంపు, స్కిల్డ్ రూ.13,772 నుంచి రూ. 18,500కు పెంపు, హైలీ స్కిల్డ్ రూ.14,607 నుంచి రూ.20,000కె పెంచారు. మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీలపై రాజకీయంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పోక్సో కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌ను పోలీసులు చట్టపరమైన ప్రొసీజర్ ప్రకారమే అరెస్ట్ చేసి విచారిస్తున్నారని స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ కక్షసాధింపులు లేవన్నారు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసులిచ్చి చట్టప్రకారమే విచారించామని గుర్తుచేశారు. "కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయినా కేటీఆర్ ఇంకా తానే ప్రభుత్వంలో ఉన్నాననే భ్రమల్లో, కల్వకుంట్ల రాజ్యాంగంలో బతుకుతున్నారు" అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం త్వరలోనే ముగుస్తుందన్నారు. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచి రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా సమస్యలను, యుద్ధాలను కూడా రాజకీయ కోణంలోనే చూస్తోందని, ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతూ సామాన్యుడి నడుం విరుస్తున్నారని మండిపడ్డారు. దేశవ్యాప్త జాతీయ జనగణనలో బీసీ కులగణన చేపట్టవచ్చంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును సీఎం రేవంత్ రెడ్డి పూర్తిస్థాయిలో స్వాగతించారు. జనగణనలో కులగణన అంశంపై తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచిందని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూడా తక్షణమే దేశవ్యాప్తంగా ఓబీసీ కుటుంబాల లెక్కింపు చేపట్టి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. "ఐటీ, అమెరికా అనే ఒకే మూస ఆలోచనలను యువత వీడాలి.

కేవలం సర్టిఫికెట్ల కోసమే చదివి, ఉపాధి లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యం ఉంటే జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి దేశాల్లో అద్భుత అవకాశాలు ఉన్నాయి.

అందుకే మన ప్రభుత్వం 'స్కిల్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేసింది, యువత నైపుణ్యాల వైపు దృష్టి సారించాలి" అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# తిరుమలలో పెరిగిన రద్దీ

- వేసవి సెలవులతో భక్తుల రాక
- దర్శనానికి 24గంటలకు పైగా సమయం
- సంయమనం పాటించాలని టీటీడీ విజ్ఞప్తి
- 24 గంటలూ కమాండ్ కంట్రోల్ నిఘా..
- క్యూలైన్లలోనే తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ

**తిరుమల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమల గిరులు భక్తుల జనసందోహంతో పోటెత్తాయి. దేశ నలుమూలల నుండి స్వామివారి దర్శనార్థం కాలినడకన మరియు వాహనాల్లో వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ రికార్డు స్థాయిలో పెరుగుతోంది. గురువారం సైతం తిరుమలలో మునుపెన్నడూ లేని విధంగా అసాధారణ రద్దీ కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న తిరుగులేని రద్దీ కారణంగా శ్రీవారి లడ్డూ ప్రసాదాల వితరణ కేంద్రాలు, కల్యాణకట్టలు, వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తుల రాక ఒక్కసారిగా తీవ్రం కావడంతో తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్–2 లోని అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలోని తాత్కాలిక షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. క్యూలైన్లు వెలుపలికి వచ్చి ఔటర్ రింగ్ రోడ్డులోని పాచికాల్వ గంగమ్మ ఆలయం వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర భక్తులు ఎండలోనే వేచి ఉన్నారు. ప్రస్తుతం టోకెన్లు లేని సామాన్య భక్తుల సర్వదర్శనానికి కనీసం 24 గంటల నుంచి 30 గంటల వరకు సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారికంగా ప్రకటించింది. తిరుమలలోని అసాధారణ పరిస్థితులను అధిగమించేందుకు టీటీడీ ఈఓ, విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టారు. శ్రీవారి సేవకుల ద్వారా నిరంతరాయంగా చల్లని తాగునీరు, పాలు, కాఫీ, ఉప్మా, అన్నప్రసాదాలను క్యూలైన్లలోనే పంపిణీ చేస్తున్నారు. ఎండ తీవ్రత, భక్తుల విపరీతమైన రద్దీ దృష్ట్యా వేచి ఉండే సమయం ఎక్కువగా ఉన్నందున, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాలను గమనించి టీటీడీ సిబ్బందికి సహకరించాలని, పూర్తి సంయమనంతో వ్యవహరించి స్వామివారిని దర్శించుకోవాలని అధికారులు కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు, టీటీడీ విజిలెన్స్ విభాగాలు ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పాటు చేసి రద్దీని క్రమబద్ధీకరిస్తున్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
గురువారం, మే 21, 2026

# కాంగ్రెస్ పాలనలో అగమ్యగోచరంగా అన్నదాతల పరిస్థితి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి
- జమ్మికుంట మార్కెట్ యార్డులో మక్కల కొనుగోలు కేంద్రాల పరిశీలన
- అధికారుల అండతో ట్రేడర్ల నిలువు దోపిడీ..
- రూ.2400 మద్దతు ధర ఉంటే రూ.1600లకే కొంటారా..?
- 20 రోజులైనా కొనుగోళ్లు చేపట్టని సర్కార్..
- రైతులపై కక్ష సాధింపు చర్యలు విడనాడాలని డిమాండ్



**జమ్మికుంట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అహోరాత్రులు శ్రమించి, చెమటోడ్చి పండించిన పంటను అమ్ముకోవడానికి రాష్ట్రంలో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారని, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ పాలనలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులోని మొక్కజొన్న (మక్క) కొనుగోలు కేంద్రాలను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన మక్కల కుప్పలను చూసి, అక్కడే పడిగాపులు కాస్తున్న రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రైతులు పంటను మార్కెట్లకు తీసుకొచ్చి 20 రోజులవుతున్నా మక్కలను కొనుగోలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు సరఫరా చేయలేక, ధాన్యాన్ని తరలించడానికి కనీసం వాహనాలు ఏర్పాటు చేయలేక, తూకం వేయడానికి కూలీలను కూడా పెట్టలేని దౌర్భాగ్య స్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. మొక్కజొన్న రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ ఉదాసీన వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోళ్లు ప్రారంభించకపోవడాన్ని ఆసరాగా చేసుకొని దళారులు, ట్రేడర్లు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని కృష్ణారెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మొక్కజొన్న కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,400 ఉంటే, ఇక్కడి కొంతమంది అధికారులు ట్రేడర్లతో కుమ్మక్కై కేవలం రూ.1,600 నుంచి రూ.1,800లకే కొనుగోలు చేస్తూ రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. దళారులను ప్రోత్సహిస్తూ రైతుల పొట్ట కొడుతున్న ఈ ప్రభుత్వం తక్షణమే మేల్కొని, యార్డులో ఉన్న ప్రతి గింజను మద్దతు ధర చెల్లించి పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులను మోసం చేస్తున్న అధికారులు, ట్రేడర్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగాడి కృష్ణారెడ్డితో పాటు బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్ యాదవ్, పట్టణాధ్యక్షుడు కొలకాని రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుప్పాల రఘు, మాజీ జిల్లా కార్యదర్శి కనుమల్ల గణపతి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్ రావు, మాజీ మండలాధ్యక్షుడు సంపెల్లి సంపత్ రావు, సర్పంచ్ పుప్పాల రాజారం, శీలం శ్రీనివాస్, రాజేష్ ఠాగూర్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ టంగుటూరి రాజ్ కుమార్, ఆవుల తిరుపతి, జీడి మల్లేష్, మెరుగు శ్రీనివాస్, తూర్పాటి శంకర్, కైలాసకోటి గణేష్, రాచేపల్లి ప్రశాంత్, శ్రీవర్తి ప్రవీణ్, కొమ్ము అశోక్, ఆడవాళ్ళ శ్రీధర్, ఆకుల పోశయ్య, బీజేపీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, గంజాయి ముఠాలపై నిఘా

## నార్కోటిక్ 'జాగిలం'తో పోలీసుల తనిఖీలు



**వేములవాడ రూరల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** యువత భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు జిల్లా పోలీసు యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. వేములవాడ రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు.రూరల్ ఎస్ఐ వెంకట్రాజం నేతృత్వంలోని పోలీస్ బృందం ప్రత్యేకంగా రప్పించిన నార్కోటిక్ డాగ్ సహాయంతో మండలంలోని కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, బస్టాండ్ పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టింది. ఈ క్రమంలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, లగేజీ బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రాజం మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల సంపూర్ణ నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి అమ్మినా, సరఫరా చేసినా కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర ఎలాంటి మత్తు పదార్థాల విక్రయాలు, నిల్వలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ప్రజల చైతన్యం, సహకారంతోనే మత్తు పదార్థాల మహమ్మారిని నిర్మూలించి, సమాజంలో భద్రతా చర్యలను మరింత సమర్థవంతంగా కొనసాగించగలమని ఎస్ఐ వెంకట్రాజం పేర్కొన్నారు. దుకాణదారులకు, యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై పోలీసులు ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ ప్రత్యేక తనిఖీల్లో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బందితో పాటు వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# ఆకలి లేని సమాజమే లక్ష్యం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అన్నదాత సుఖీభవ" అనే పవిత్ర నినాదంతో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ ఆధ్వర్యంలో సాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమం గురువారంతో విజయవంతంగా 698వ రోజుకు చేరుకుంది. పట్టణంలోని పేదలు, అన్నార్తులు, మరియు రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల ఆకలి తీర్చడమే ధ్యేయంగా ఈ మహత్కార్యం నిరంతరాయంగా కొనసాగుతోంది. గురువారం నాటి అన్నదాన కార్యక్రమాన్ని కొండ సహస్ర జన్మదినాన్ని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు అందించిన ఆర్థిక సహాయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ శాశ్వత దాతలు నాగుబోతు రవీందర్ – జ్యోతి దంపతులు (భాను ఏజెన్సీస్), అలాగే సంవత్సర దాతలు తోట లక్ష్మి, కూరగాయల మధు – మమత దంపతులు పూర్తి సహకారాన్ని అందించారు. దాతల సహకారంతో రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణతో పాటు వేములవాడ పట్టణ పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది అన్నార్తులకు, యాచకులకు, నిరుపేదలకు నిర్వాహకులు స్వయంగా శుభ్రమైన, రుచికరమైన భోజన ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ నిర్వాహకులు తోట లహరి మాట్లాడుతూ... గత 698 రోజులుగా ఎంతోమంది దాతల ఉదారతతోనే ఈ సేవా యజ్ఞాన్ని నిరంతరాయంగా నడపగలుగుతున్నామని తెలిపారు. సమాజంలో ఆకలితో ఏ ఒక్కరూ అలమటించకూడదనే ఆశయంతో ఈ ట్రస్ట్ పనిచేస్తోందని పేర్కొన్నారు. ట్రస్ట్ ద్వారా చేపట్టే ఇలాంటి మరిన్ని సామాజిక, సేవా కార్యక్రమాలకు ప్రజలు, దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆమె పిలుపునిచ్చారు. సహాయం చేయాలనుకునే వారు ట్రస్ట్ అధికారిక నెంబర్: 8919376459 ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తోట లహరి, రాజేష్, స్థానిక యువకులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# వేములవాడలో రాజీవ్ గాంధీకి ఘన నివాళి

**వేములవాడ/సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** భారతదేశ సాంకేతిక, సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి దేశాన్ని ఆధునిక ప్రపంచం వైపు నడిపించిన మహోన్నత దార్శనికుడు, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంగ పర్శరాము గౌడ్ కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వేములవాడ అర్బన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అర్బన్ మండల అధ్యక్షుడు వంగ పర్శరాము గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక నంది కమాన్ చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వంగ పర్శరాము గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పిల్లి కనకయ్యలు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దేశ ప్రగతి కోసం చేసిన త్యాగాలు చారిత్రాత్మకమైనవని, ఆయన ఆశయ సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజీవ్ గాంధీ పరిపాలనలోని కీలక మైలురాళ్లను వారు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. భారతదేశంలో నేడు మనం చూస్తున్న సమాచార సాంకేతిక రంగ వృద్ధికి, గ్లోబల్ టెలికాం విప్లవానికి రాజీవ్ గాంధీ అప్పట్లోనే బలీయమైన పునాది వేశారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందనే నమ్మకంతో, ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించి దేశ రాజకీయాల్లో యువతకు భాగస్వామ్యం కల్పించిన ఘనత ఆయనదే. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత వసతితో కూడిన విద్యను అందించడం కోసం దేశవ్యాప్తంగా 'జవహర్ నవోదయ విద్యాలయాలను' ఏర్పాటు చేశారు. అధికార వికేంద్రీకరణ ద్వారా గ్రామీణ ప్రాంతాలు స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేశారు. దేశంలో అంతర్గత భద్రత, శాంతిని పెంపొందించడానికి అస్సాం, మిజోరాం, పంజాబ్ ప్రాంతాలలో చారిత్రాత్మక శాంతి ఒప్పందాలను కుదుర్చుకున్నారని స్మరించుకున్నారు. దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ నివాళి కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మరియు వేములవాడ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, టౌన్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని రాజీవ్ గాంధీ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.

# అసైన్డ్ భూమిని దళితులు, పేదలకు ఇవ్వాలి

- తాసిల్దార్ కు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి



**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల పరిధిలోని అంబటిపల్లి గ్రామ శివారులో గల పురంబోగు భూమిని పక్కదారి మల్లించకుండా అర్హులైన దళితులు పేదలకు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బంగారయ్య ఆధ్వర్యంలో తహసిల్దార్ వెంకటేష్ కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ అంబటిపల్లి శివారుల గల సర్వేనెంబర్ 471 పోరంబోగు భూమిని అసైన్మెంట్ కమిటీ లేకుండానే పోరంబోగు భూమిని ఇతర గ్రామానికి చెందిన వారికి ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని వాపోయారు. అంబటిపల్లి గ్రామానికి సంబంధించిన ఇట్టి సర్వేనెంబర్ 471 భూమిని అంబటిపల్లి గ్రామంలోని దళితులు పేదలకు ఇవ్వకుండా పక్క గ్రామమైన రాయవరంలోని ఇతర వర్గాలకు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అంబటిపల్లి గ్రామంలో 600మంది దళితులు ఉన్నారని, ఎటువంటి భూమి లేకుండా 20 కుటుంబాలు ఉన్నాయని గుర్తు చేశారు. తమ గ్రామంలోని భూమిలేని దళితులు పేదలకు అన్యాయం చేసె ప్రయత్నాలను విరమించాలని లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉదృతం చేస్తామని అన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బంగారయ్య, ఎంఆర్పిఎస్ తాలూకా ఇంచార్జి సిద్ధూ, బీఎస్పీ మండల నాయకులు గిరిబాబు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అశోక్, బాబు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్ Voice of Vande Bharath

VOICE OF VANDE BHARATH

గురువారం, మే 21, 2026

## ఉప్పల్‌లో 'సన్‌రైజర్స్' ఐపీఎల్ మ్యాచ్

**టికెట్ల దందాపై పోలీసుల ఉక్కుపాదం**

**నేడు ఎస్ఆర్‌హెచ్ వర్సెస్ ఆర్‌సీబీ హైవోల్టేజ్ పోరు..**

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌పై భారీ క్రేజ్ నెలకొంది. విరాట్ కోహ్లీ, హెన్రిచ్ క్లాసెన్ వంటి స్టార్ ఆటగాళ్లు తలపడనుండటంతో ఈ మ్యాచ్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అధికారికంగా టికెట్ల అమ్మకాలు ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే 'సోల్డ్ అవుట్' అని బోర్డులు పెట్టడంతో నిజమైన క్రికెట్ అభిమానులు తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఈ టికెట్ల దందాపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని అక్రమ ముఠాలు ముందస్తు ప్రణాళికతో భారీ సంఖ్యలో టికెట్లను లాగేసి, వాటిని బ్లాక్ మార్కెట్‌లో సామాన్యులకు ఐదారు రెట్లు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ సీజన్ అధికారిక టికెటింగ్ భాగస్వామి అయిన 'జొమాటో డిస్ట్రిక్ట్' యాప్ ద్వారా జరిగిన ఆన్‌లైన్ బుకింగ్‌లపైనే అభిమానులు ప్రధానంగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ స్టేడియం పరిసరాల్లో అక్రమంగా సాగుతున్న ఈ బ్లాక్ టికెట్ల దందాపై రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మల్కాజ్‌గిరి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. బ్లాక్ మార్కెట్‌లో టికెట్లు అమ్ముతున్న ముఠాలను పట్టుకునేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించారు. ఇప్పటివరకు జరిపిన తనిఖీల్లో బ్లాక్ టికెట్ల విక్రయాలపై 10 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఇంటింటి సర్వే పారదర్శకంగా జరగాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్!
- వివరాలు పక్కాగా నమోదు చేయాలి
- మే 11 నుంచి జూన్ 9 వరకు 'ఇళ్ల గణన'
- లింగాలలో కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన



**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశ భవిష్యత్తు ప్రణాళికలకు అత్యంత కీలకమైన జనగణన ప్రక్రియలో ప్రతి కుటుంబం వివరాలను పక్కాగా, ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని లింగాల మండల కేంద్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న జనగణన – ఇండ్ల గణన ప్రక్రియను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్న వివరాల రిజిస్టర్లను, మొబైల్ యాప్‌లను కలెక్టర్ స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లతో మాట్లాడుతూ ఇంటింటి సర్వే సక్రమంగా, అత్యంత పారదర్శకంగా జరిగేలా చూడటం ఎన్యూమరేటర్ల ప్రధాన బాధ్యత అని గుర్తుచేశారు. జనగణన మొదటి విడతలో భాగంగా జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ నిర్దేశిత నిబంధనల ప్రకారం మొబైల్ యాప్ ద్వారానే స్పష్టమైన, కచ్చితమైన వివరాలతో పూర్తి చేయాలన్నారు. మొదటి దశలో భాగంగా మే 11న ప్రారంభమైన ఈ ఇళ్ల గణన ప్రక్రియ జూన్ 9వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని, ఈ గడువులోగా వంద శాతం ఇళ్లను కవర్ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ స్థాయి ప్రణాళికలు సమర్థవంతంగా జరగాలన్నా, ప్రజలకు నాణ్యమైన సేవలు అందాలన్నా ఈ గణాంకాలే ప్రాధాన్యత వహిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. జనగణన సిబ్బంది కేవలం ప్రజలు అందించిన అధికారిక సమాచారాన్ని మాత్రమే నమోదు చేయాలని, తమ సొంత ఊహలు లేదా ఇతర వివరాల స్వీకరణ చేయకూడదని గట్టిగా చెప్పారు. ప్రజలు కూడా తమ ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు ఎలాంటి దాపరికం, భయాందోళనలు లేకుండా కచ్చితమైన సమాధానాలు చెప్పి దేశ జనాభా లెక్కల సేకరణకు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీవో, లింగాల తహసిల్దార్, ఎంపీడీఓ, జనగణన నోడల్ అధికారులు, సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉదయం 5:30 గంటలకే ఉపాధి పనులు ప్రారంభించాలి

- కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్!
- కూలీలకు ఎక్కువ రోజులు ఉపాధి కల్పనే లక్ష్యం
- జూలై 1 నుంచి అమల్లోకి రానున్న సరికొత్త "వీబీజీ రామ్" పథకం
- ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేయాలి
- ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీల ఆరోగ్యాన్ని



దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ ఉదయం 5:30 గంటలకే ఉపాధి పనులను ప్రారంభించాలని, నిర్దేశిత సమయానికి కూలీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని లింగాల మండలం సూరారం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు చేపడుతున్న భూమి చదును పనులను గురువారం ఉదయం కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో ముఖాముఖి మాట్లాడి రోజువారీ వేతనం ఎంత పడుతుందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ కీలక ప్రకటన చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఈ ఏడాది జూన్ 30 వరకు మాత్రమే కొనసాగుతుందని వెల్లడించారు. జూలై 1 నుంచి కొత్తగా "వీబీజీ రామ్" పథకం అమల్లోకి రానుందని, ఈ నూతన పథకం విజయవంతంగా అమలు కావడానికి అవసరమైన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అధికారులు ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రణాళికలో ఉన్న అన్ని అభివృద్ధి పనులను వెంటనే గ్రౌండింగ్ చేసి, నిర్ణీత గడువులోగా



పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేజ్ కంపోనెంట్ కింద కార్మికులకు ఎక్కువ రోజుల ఉపాధి కల్పించే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే మెటీరియల్ కంపోనెంట్ కింద చేపట్టే పనుల్లో కచ్చితమైన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. చెరువుల అభివృద్ధి, కాలువల నిర్మాణం, గ్రామీణ రహదారుల మరమ్మతులు, వర్షపు నీటి నిల్వ పనులు, పచ్చదనం పెంపు కార్యక్రమాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్మికులకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో లింగాల తహసిల్దార్ వెంకట్, ఎంపీడీఓ, మండల విద్యాధికారి బషీర్, ఉపాధి హామీ ఏపీఓ, ఈసీలు, మండల స్థాయి సిబ్బంది, సూరారం గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- మద్దిమడుగు ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఐదు దుకాణాలు దగ్ధం
- షార్ట్ సర్క్యూట్‌తో రూ.15 లక్షల ఆస్తినష్టం
- తక్షణమే పరామర్శించి ఆర్థిక సహాయం



**అచ్చంపేట/పదర, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పదర మండలం మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ భరోసా ఇచ్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో ఐదు దుకాణాలు పూర్తిగా బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.15 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. ప్రమాద సమాచారం తెలియగానే అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో ఘటనా స్థలాన్ని సందర్శించారు. కాలిన దుకాణాలను పరిశీలించి, తీవ్ర దిగ్భ్రాంతికి గురైన బాధితులను ఓదార్చారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన స్థానిక చిన్న వ్యాపారులు గౌస్, సందీప్, శ్రీను, వెంకటేష్, మల్లేష్‌లను ఎమ్మెల్యే వంశీకృష్ణ వ్యక్తిగతంగా పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. బాధితులకు తక్షణ ఉపశమనం కోసం ఆయన తన సొంత నిధుల నుండి నగదు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కలెక్టర్‌తో ఫోన్ సంభాషణ: ఎమ్మెల్యే వంశీకృష్ణ ఘటనా స్థలం నుంచే నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రమాద తీవ్రతను వివరించి, సర్వస్వం కోల్పోయిన ఈ ఐదుగురు పేద వ్యాపారులకు ప్రభుత్వ పరంగా లభించే నష్టపరిహారాన్ని, అత్యవసర సాయాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ రెవెన్యూ అధికారులను నివేదిక కోరారు.ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఎలాంటి కష్టం వచ్చినా తక్షణమే స్పందిస్తామని, బాధితులు మళ్లీ తమ వ్యాపారాలను నిలబెట్టుకునేలా ప్రభుత్వం నుండి పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పదర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మద్దిమడుగు ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక రెవెన్యూ అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు పాల్గొని బాధితులకు అండగా నిలిచారు.

## రూపాయి పతనంపై ఆర్‌బీఐ దిద్దుబాటు

- అధికారులతో గవర్నర్ మల్హోత్రా మంతనాలు
- బుధవారం 96.95 రికార్డు పతనం..
- గురువారం నాటి ట్రేడింగ్‌లో 41 పైసలు పుంజుకున్న రూపాయి

**ముంబయి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ రికార్డు స్థాయిలో బలపడటం, ముడి చమురు ధరల భారం పెరగడంతో భారత కరెన్సీ 'రూపాయి' విలువ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయింది. ఈ నేపథ్యంలో రూపాయి విలువను స్థిరీకరించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రంగంలోకి దిగింది. రూపాయి పతనాన్ని అడ్డుకోవడానికి వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను ఆర్‌బీఐ తీవ్రంగా పరిశీలిస్తోందని 'బ్లూమ్‌బెర్గ్' అంతర్జాతీయ వార్తా సంస్థ గురువారం ఒక ప్రత్యేక నివేదికలో వెల్లడించింది. రూపాయి విలువను కాపాడుకునేందుకు, తదుపరి ఆర్థిక కార్యాచరణపై చర్చించేందుకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో సహా సెంట్రల్ బ్యాంక్ ఉన్నతాధికారులు ముంబయిలోని ప్రధాన కార్యాలయంలో వరుస అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం. డాలర్ల కొరత రాకుండా మార్కెట్లోకి విదేశీ కరెన్సీ నిల్వలను విడుదల చేయడం, అవసరమైతే కఠిన ద్రవ్యోల్బణ నియంత్రణ చర్యలు చేపట్టడంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.